## క్లుప్తంగా

### కొడంగల్ బరిలో బాల్‌రాజ్



కొడంగల్: శాసనసభ ఎన్నికల నేపథ్యంలో కొడంగల్ బరిలో ఉంటున్నట్లు వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తమ్మలి బాల్‌రాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడారు. పార్టీ అధ్యక్షురాలు షర్మిల తెలంగాణలో పోటీ చేయనున్నారని, పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న తనకు కొడంగల్ టికెట్ ఇస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు.

**తీన్మార్ మల్లన్న ..**

కొడంగల్ రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొడంగల్, మేడ్చల్ నియోజవర్గాల నుంచి తీన్మార్ మల్లన్న పోటీ చేయనున్నారని మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు ఘనపురం శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యుడు జాక వెంకటేశ్, నరేష్ పటేల్ తెలిపారు. జనాభాలో 50శాతం ఉన్న బీసీలకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వటం లేదని, బహుజనులంతా సంఘటితమై మల్లన్న గెలుపునకు కృషిచేయాలని కోరారు. ఇందులో టీం జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్, నాయకులు సాయిరాం, వేమన్న, హరిదాస్, సంతోష్, సాకేత్‌గుప్తా, మణికంఠ, మంజునాథ్, శివ ఉన్నారు.

### డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే



డిగ్రీ పట్టాలతో విద్యార్థులు

తాండూరు టౌన్: శ్రీసాయి డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు సీనియర్లు ఏర్పాటు చేసిన స్వాగతోత్సవం కోలాహలంగా జరిగింది. అనంతరం డిగ్రీ పూర్తి చేసుకున్న వారికి కళాశాల కరస్పాండెంట్ మల్లేశ్ యాదవ్ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్య విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా ఉండరాదని, నైతిక విలువలను సైతం పెంపొందించేలా ఉండాలని సూచించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేలా పయనించాలన్నారు. ఇందులో ప్రిన్సిపాల్ భూపతి రెడ్డి, అధ్యాపకులు శ్రీనివాస్ యాదవ్, బసంత్, యాదప్ప, కల్పన, వెంకట్, మన్నన్, మనోజ్ ఉన్నారు.

### పరిగి టికెట్ ఇవ్వండి..



కిషన్‌రెడ్డితో మల్లేశ్ పటేల్ తదితరులు

పూడూరు: పార్టీ కోసం పని చేస్తున్న తనకు పరిగి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్ పటేల్.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడారు. పదిహేనేళ్లుగా పార్టీలో కొనసాగుతున్నానని, సామాన్య కార్యకర్త నుంచి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నాని, తనకు టికెట్ ఇవ్వాలని విన్నవించినట్లు పేర్కొన్నారు. దీంతో కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పాండుగౌడ్, వెంకటయ్యగౌడ్, రమేష్ ఉన్నారు.

### ఎన్నికల కోడ్‌ను అమలు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాలతో పాటుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫ్లెక్సీలను తొలగించాలని కోరుతూ గురువారం విజయకుమార్ ఆర్డీఓ వెంకటమాధవరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడ్ అమలులోకి వచ్చి నాలుగు రోజులు గడుస్తున్నా నేటి వరకు అధికార పార్టీ ఫ్లెక్సీలు, ప్రచార సాధనాలను తీయకపోవడంలో ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. కోడ్‌ను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరుగుతున్న కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలన్నారు.

### 16న చింత చెట్ల వేలం

షాబాద్: మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానానికి చెందిన చింతచెట్ల ఫలసాయం కోసం ఏడాది పాటు కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 16న సోమవారం ఉదయం 11 గంటలకు దేవాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ముందుగా చెట్ల ఫలసాయం కాపును చూసుకోవాలన్నారు. దేవస్థానానికి రూ.500 డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.



తాండూరు టౌన్: పాఠశాల ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



కొడంగల్: బతుకమ్మలతో విద్యార్థినులు

# బడిలో బతుకమ్మ సంబురాలు

**ఆడిపాడిన బోధన సిబ్బంది, విద్యార్థినులు**

బతుకమ్మ పండుగ సందర్భంగా గురువారం జిల్లాలోని పలు పాఠశాలల్లో ముందస్తుగా సంబురం నిర్వహించారు. విజయదశమి, బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వం విద్యాలయాలకు శుక్రవారం నుంచి సెలవులు ప్రకటించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ సంస్కృతి అయిన బతుకమ్మ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు, బోధన సిబ్బంది బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో అలరించారు. సాయంత్రం పూల గోపురాలను స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేసి.. పోయిరా గౌరమ్మ అంటూ వీడ్కోలు పలికారు.

– సాక్షి, నెట్‌వర్క్



తాండూరు టౌన్: టీఎస్ గురుకులంలో బతుకమ్మ పేరుస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయురాళ్లు



కొడంగల్: నెత్తిన బతుకమ్మలతో ఉపాధ్యాయబృందం, విద్యార్థినులు



దోమ: బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో..



కొడంగల్ రూరల్‌లో.. విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం, ఎంఈఓ రాంరెడ్డి



పరిగిలో.. విద్యార్థినులు



కుల్కచర్ల: ఆదర్శ పాఠశాలలో..



పెద్దేముల్: వివేకానంద పాఠశాలలో..



మర్పల్లి: ఆదర్శపాఠశాలలో.. విద్యార్థులు, ఉపాధ్యాయబృందం, ప్రిన్సిపాల్ కృష్ణకుమార్

### 16న 'వీరశైవ' బతుకమ్మ

తాండూరు టౌన్: తాండూరు వీరశైవ మహిళా విభాగ్ ఆధ్వర్యంలో ఈ నెల 16న స్థానిక శ్రీ భావిగి భద్రేశ్వర దేవస్థానం ఆవరణలో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు విభాగ్ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కానున్న సంబురాలకు వీరశైవ మహిళలు ఇంటి వద్దే బతుకమ్మను పేర్చుకుని, ఎరుపు లేదా ఆకుపచ్చ రంగు సంప్రదాయ చీరలో రావాలని కోరారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వేడుకలను విజయవంతం చేయాలన్నారు.

### మున్నూరు కాపు సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

కొడంగల్: తెలంగాణ మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కొడంగల్‌కు చెందిన బాకారం మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా నారా రఘువీర్‌రెడ్డి, బాకారం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా యాదయ్య, కోశాధికారిగా సిరుసని రమేష్, సంయుక్త కార్యదర్శిగా పవన్‌కుమార్, మహిళా కార్యదర్శిగా భాగ్యలక్ష్మి, కార్యనిర్వాహక మండలి సభ్యులుగా పట్లోళ్ల అనిల్, మర్పల్లి శ్రీనివాస్‌లను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

### వచ్చేది బీజేపీ ప్రభుత్వమే..

మర్పల్లి: శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ కమిటీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ పాలన విధానాలకు ఆకర్షితులైన తెలంగాణ ప్రజలు.. బీజేపీ వైపు మొగ్గుచూపుతున్నారని చెప్పారు. వికారాబాద్ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా దరఖాస్తు చేసుకున్న సిరిపురం ఎర్రోళ్ల లక్ష్మణ్, లేదా మరెవరికైనా టికెట్ ఇస్తే వారి విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఇందులో పార్టీ జిల్లా నాయకులు రామేశ్వర్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి బస్వలింగం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సంతోశ్‌రెడ్డి, మధుకర్ ఉన్నారు.

# వసూళ్లకు పాల్పడుతున్న ఏఈ

- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య
- చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్



ఏడీఈ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: అక్రమాలకు పాల్పడుతున్న ట్రాన్స్‌కో ఏఈపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏడీఈ అందుబాటులో లేకపోవడంతో.. కార్యాలయ సిబ్బందికి వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏఈ డబ్బులు లేనిదే పనులు చేయటం లేదని, రైతులు, ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా సంస్థాగత పనులు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండీ కొడుతున్నారని విమర్శించారు. కరెంట్ కనెక్షన్ కోసం వెళ్లిన వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఇదే విషయమై ఇటీవల పలు పత్రికల్లో వార్తలు వచ్చాయని, తగిన విచారణ అనంతరం సంబంధిత అధికారులు ఏఈపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో సీపీఎం నాయకులు సత్తయ్య, రఘురాం, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

# అధిక దిగుబడికి 'సాంద్రత పద్ధతి'

- యాజమాన్య సూచనలు పాటించి పంటను కాపాడుకోండి
- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సుధారాణి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుధారాణి

పూడూరు: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి, పంటలను కాపాడుకోవాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సుధారాణి సూచించారు. గురువారం మండల కేంద్రం రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అధిక సాంద్రత పత్తి సాగుపై రైతులకు వివరించారు. సాంద్రత పత్తిలో కలుపు తీయుట, ఎరువులు తదితర యాజమాన్య పద్ధతులతో పాటు.. పంట ఆవశ్యకత, దిగుబడిని పెంచే విధానం గురించి చెప్పారు. పత్తిలో అంతర పంటలు వేసుకొని చీడపీడలను నివారించవచ్చన్నారు. సాధారణ పత్తి కంటే అధిక సాంద్రత సాగుతో అధిక దిగుబడులు పొందవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే మండల పరిధి చింతలపల్లి, కంకల్, మేడిపల్లికలాన్ గ్రామాల్లో ఈ పద్ధతిపై ప్రదర్శనలు ఇచ్చామని వెల్లడించారు. ఇందులో శాస్త్రవేత్తలు సుధాకర్, రాజేశ్వర్‌రెడ్డి, యమున, ఏఓలు లక్ష్మీకుమారి, తులసీరాం, ఏఈఓ ఇలియాస్ ఉన్నారు.

### ఆంగ్ల భాషపై ప్రావీణ్యం తప్పనిసరి

చేవెళ్ల: నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరు ఇంగ్లిష్ భాషపై ప్రావీణ్యం తప్పనిసరిగా సాధించాలని ప్రముఖ స్పోకెన్ ఇంగ్లిష్ నిర్వాహకుడు ఎఎస్ రెడ్డి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కాంచనలత ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాల పంపిణీ, అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో చదివే విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, రూప్న రవీంద్ర, వైష్ణవి, జ్యోతి, స్వర్ణలత, లక్ష్మీ, సతీష్, వెంకటేశ్వర్లు, రవీంద్ర, రేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

### మంచుతెర కప్పేసింది..

పెద్దేముల్: చలికాలం సమీపిస్తున్న నేపథ్యంలో పొగమంచు రోడ్లను కమ్మేస్తోంది. గురువారం ఉదయం 7 గంటలకు మంచు విస్తృతం కావడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. దీంతో రోడ్డు పక్కనే వాహనాలను నిలిపేశారు. ఇదిలా ఉండగా.. మంచువలన పత్తి గూడ రాలుతోందని, కంది పంటలకు పురుగు ఎగబడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



తాండూరు-సంగారెడ్డి ప్రధాన రహదారిని కప్పేసిన పొగమంచు

### బీఎస్పీకి 'పెద్ది' రాజీనామా

అనంతగిరి: బీఎస్పీ వికారాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కొనసాగుతున్న పెద్ది అంజయ్య.. బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో పార్టీ టికెట్ ఆశించిన తనకు.. తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో రెండేళ్లు చాలా కార్యక్రమాలు చేశానని, అయినా గుర్తింపు లేదని తెలిపారు. నేటి నుంచి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటానని, భవిష్యత్తు కార్యాచరణ త్వరలోనే ప్రకటిస్తానని వెల్లడించారు.

### సేవాభావం అలవర్చుకోవాలి

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశనుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని కృష్ణవేణి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా అన్నారు. గురువారం పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు విరాళాలను సేకరించి సచ్ ఆర్గనైజేషన్‌కు చెందిన అంధ విద్యార్థులకు రూ. 45వేల ఆర్థిక సహాయం అందజేశారు.

### నేటి నుంచి చిలుకూరు గురుకులంలో క్రీడలు

మొయినాబాద్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల విద్యార్థులకు ప్రాంతీయ స్థాయి క్రీడా పోటీలు చిలుకూరు గురుకులంలో ప్రారంభం కానున్నాయి. 13 నుంచి 16 వరకు వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని 11 బాలుర గురుకులాల నుంచి 955 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. శుక్రవారం ఉదయం నుంచే టోర్నీ మొదలు కానుండడంతో గురువారం మధ్యాహ్నం నుంచే విద్యార్థులు చిలుకూరు గురుకులానికి చేరుకున్నారు. గురుకులాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద.. పోటీ నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమయపాలన, సమయస్ఫూర్తితో పోటీలు నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

# ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

- అక్రమ రవాణాను అరికట్టాలి
- బెల్టు దుకాణాలపై దృష్టి సారించాలి
- తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి



మోమిన్‌పేట: మాట్లాడుతున్న తహసీల్దార్

మోమిన్‌పేట: ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి అన్నారు. గురువారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో బీఎల్‌ఓలు, పోలీసులతో ఆయన మాట్లాడారు. ఓటరు నమోదు ప్రక్రియకు ఇంకా అవకాశం ఉందని, అర్హత కలిగిన వారిని పేర్లు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణపై దృష్టి సారించాలని, ఎన్నికలు ముగిసే వరకు వాటిని కట్టడి చేయాలని ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద అక్రమ రవాణాను అడ్డుకోవాలని, ఎన్నికల ప్రక్రియకు అడ్డంకులు సృష్టించే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందులో సీఐ ఆంజనేయులు, ఎస్ఐ విఠల్‌రెడ్డి, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

**అవగాహన కల్పించాలి**

కుల్కచర్ల: ఎన్నికల నేపథ్యంలో అమలులో ఉన్న ఎన్నికల ప్రవర్తన నియమావళి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ మురళీధర్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌లు అన్నారు. తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బీఎల్‌ఓలతో వారు మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్నందున రాజకీయ పార్టీలు, నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు ఏర్పాటు చేయకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు

# 'మైండ్ స్పార్క్' టెస్టులో సత్తాచాటిన సాయిరాం



విద్యార్థి సాయిరాంను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బలరాంనాయక్

కొడంగల్ రూరల్: పాతకొడంగల్ శివారు గిరిజన గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి సాయిరాం నాయక్ మైండ్ స్పార్క్ టెస్టులో పాల్గొని, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడని ప్రిన్సిపాల్ బలరాంనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి రూ.14 వేల విలువ చేసే ట్యాబ్‌ను అందుకున్నాడని చెప్పారు. దీంతో విద్యార్థి సాయిరాంను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే మైండ్ స్పార్క్ టెస్టులో తెలుగు, ఇంగ్లిష్, గణితం సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు వేస్తుంటారని, ఇందులో సాయిరాం గరిష్టంగా 682 గంటల పాటు పాల్గొని ప్రథమంగా నిలిచాడని పేర్కొన్నారు. ఇదే కాంటెస్టులో పాఠశాలకు చెందిన 98మంది విద్యార్థులు 40 గంటల పాటు పాల్గొని సర్టిఫికెట్లు అందుకున్నారని తెలిపారు.

# అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపుదాం

- అధికారంలోకి వస్తే 'గ్యారంటీ' పథకాలు
- ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ శ్రేణులు



మర్పల్లి: పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్



కొడంగల్: కాంగ్రెస్‌లో చేరిన కొత్తూరు యువకులు

కొడంగల్/బొంరాస్‌పేట/మర్పల్లి: 'రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేక వస్తోంది. కేసీఆర్ అవినీతి పాలనకు విసుగు చెందిన ప్రజానీకం.. రాబోయే ఎన్నికల్లో కల్వకుంట్ల కుటుంబానికి తగిన బుద్ధి చెప్పనున్నారు. అభివృద్ధి పేరిట రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన బీఆర్ఎస్‌ను సాగనంపే రోజు ఎంతో దూరం లేదు' అని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆ పార్టీ నాయకులు ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అధిష్టానం ప్రకటించిన 'ఆరు గ్యారంటీ కార్డులు' (పథకాలు) అమలు అవుతాయని పేర్కొన్నారు.

**బొంరాస్‌పేటలో..**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 'ఆరు గ్యారంటీ కార్డులు' సాధ్యమని కోస్గి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటరాములు గౌడ్ అన్నారు. మండల పరిధి ఏర్పుమళ్లలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఇందులో పార్టీ నాయకులు అంజిల్‌రెడ్డి, జయకృష్ణ, నర్సింహులు నాయుడు, రాజేశ్‌రెడ్డి, మల్లేశ్, కిష్టప్ప, కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

**కొడంగల్‌లో.. పలువురి చేరిక**

బొంరాస్‌పేట మండలం కొత్తూరు గ్రామానికి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా.. వారికి ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో చేరుతున్నట్లు పేర్కొన్నారు.

**మర్పల్లిలో..**

బీఆర్ఎస్ పాలనపై విసుగు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ తెలిపారు. బూచన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రఘుపతి రెడ్డి, దయాకర్‌రెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, అనంత్‌రెడ్డిలతో పాటు వారి అనుచరులు సుమారు 30 మంది కార్యకర్తలు పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారికి మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ నగరంలోని గాంధీ భవనంలో పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఇందులో బూచన్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, గ్రామ కమిటీయూత్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఎంఎస్‌యూ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు బిచ్చిరెడ్డి, బక్కారెడ్డి, బల్వంత్‌రెడ్డి ఉన్నారు.